క్లుప్తంగా

సమస్యలను తెలిపితే పరిష్కరిస్తా



భిక్కనూరు: కాంగ్రెస్ నాయకులకు కార్యకర్తలు, ప్రజలు సమస్యలను తన దృష్టికి తీసుకవస్తే వెంటనే పరిష్కరిస్తానని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ అన్నారు.శనివారం హైదారాబాద్‌లో భిక్కనూరు మాజీ ఎంపీపీ తోగరి సుదర్శన్ ఎంపీ సురేశ్ షెట్కార్‌ను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కాచాపూర్ గ్రామంలో నీటి ఎద్దడి నివారణకు రెండు బోరుబావులు, మోటర్ పంపులు బిగించాలని మాజీ ఎంపీపీ సుదర్శన్ విన్నవించగా ఎంపీ సురేశ్ షెట్కార్ వెంటనే మంజూరు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పండ్ల రాజు, లింగం తదితరులు ఉన్నారు.

జిల్లా గ్రంథాలయాలకు పుస్తకాల వితరణ



కామారెడ్డి అర్బన్: జిల్లా గ్రంథాలయ సంస్థకు పలువురు దాతలు పోటీ పరీక్షల పుస్తకాలు అందజేశారని సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా రేణువ పవన్, ములేవా దినేష్ అనే దాతలను శనివారం ఆయన అభినందించారు. దాతలు అందజేసిన పుస్తకాలను ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ గ్రంథాలయాలకు పంపిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు




భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలో టోల్‌ప్లాజా నిర్మాణంతో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటానని కామారెడ్డి ఆర్డీవో వీణ అన్నారు. టోల్‌ప్లాజా నిర్మాణంతో ఇబ్బందులు కలుగుతాయని రైతులు శుక్రవారం ఆందోళన చేసిన విషయం తెలిసిందే. దీంతో విషయం తెలుసుకున్న ఆమె శనివారం టోల్‌ప్లాజా నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని టోల్‌ప్లాజా నిర్మాణ ఇంజినీర్లకు ఆమె సూచించారు. తహసీల్దార్ శివప్రసాద్ ఉన్నారు.

కులగణనపై హర్షం



కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం కుల గణనను నిర్వహించి బీసీల రిజర్వేషన్ల పెంపునకు చేస్తున్న కృషి హర్షనీయమని రాష్ట్ర ఓబీసీ వర్కింగ్ కమిటీ చైర్మన్ తూము వినయ్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో జయశంకర్ కాలనీ మున్నూరుకాపు సంఘ సభ్యులతో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం చట్టపరంగా అమలులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు హన్మండ్ల రాంరెడ్డి, ఉపాధ్యక్షుడు సీహెచ్. శ్రీకాంత్, కార్యదర్శులు వెంకట్, వెంకటస్వామి, రాజేందర్, నితీష్, గోవు శ్రీనివాస్, జగదీష్, బాలకిషన్, గోపాల్, భూమయ్య, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'జీవితంలో ధ్యానం, శాంతి భాగం కావాలి'



కామారెడ్డి అర్బన్: ప్రతి ఒక్కరి జీవితంలో ధ్యానం, శాంతి, సహనం భాగం కావాలని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఓం శాంతి కేంద్రాల నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఇంచార్జి బీకే జయదిదీ అన్నారు. స్థానిక పంచముఖి హనుమాన్ కాలనీలోని ఓంశాంతి కామారెడ్డి కేంద్రంలో శనివారం బాలలు బంగారు భవిష్యత్తు వేసవి శిబిరం నిర్వహించగా 12 ఏళ్ల లోపు పిల్లలు 70 మంది పాల్గొన్నారు. శిబిరంలో షీ టీం అధికారులు స్వీయ రక్షణపై సలహాలు ఇచ్చారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. బ్రహ్మకుమారీలు గంగ, లలిత, సంతోషిలతో పాటు ఆయా కేంద్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.

స్టేడియం నిర్మాణం పనులు పదేళ్లుగా..

- రూ. కోటి 50 లక్షల నిధులు మంజూరు
- వినియోగంలోకి వస్తే దోమకొండలో క్రీడాకారులకు మేలు



దోమకొండలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇండోర్ స్టేడియం పనులు

దోమకొండ : క్రీడాకారులను ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా ఆచరణలో మాత్రం పనులు ముందుకు సాగడం లేదు. వివిధ రంగాల్లో ఉత్తమ క్రీడాకారులను తయారు చేయాలనే సంకల్పంతో మండల కేంద్రంలో 2016లో రూ. 2కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులకు అప్పటి ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ శంకుస్థాపన చేశారు. స్టేడియం నిర్మాణం కోసం గ్రామ శివారులోని గుండ్ల చెరువు సమీపంలో నాలుగు ఎకరాల భూమిని కేటాయించారు. పనులు పూర్తయితే ఉమ్మడి దోమకొండ మండలంలోని క్రీడాకారులకు ఎంతో ఉపయోగం.ఇండోర్ స్టేడియం నిర్మాణం త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని క్రీడాకారులు కోరుతున్నారు. దీంతో వివిధ రంగాల్లో క్రీడాకారులు రాణించడానికి అవకాశం ఉంటుంది.

అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలు..

ఇండోర్ స్టేడియం పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ప్రభుత్వం స్టేడియం పనుల కోసం రూ.2కోట్లను క్రీడలు యువజన సర్వీసుల విభాగం నుంచి మంజూరు చేసింది. దాదాపు 70 శాతం పనులు పూర్తికాగా మిగితా పనులను అసంపూర్తిగా వదిలేశారు. దాదాపు రూ.కోటి 50 లక్షల పనులు పూర్తయ్యాయి. దాదాపు రూ.50 లక్షల వరకు బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపివేసినట్లు కాంట్రాక్టర్ తెలిపారు. పనులు అసంపూర్తిగా చేయడంతో స్టేడియం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులు పూర్తి చేసేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

బిల్లులు రాకపోవడంతోనే..

మండల కేంద్రం శివారులోని గుండ్ల చెరువు వద్ద ఇండోర్ స్టేడియం పనులు అసంపూర్తిగా నిలిచిపోయిన మాట వాస్తవమే. ఈ విషయంలో సదరు కాంట్రాక్టర్ తనకు బిల్లులు రానందున పనులు నిలిపివేశారు. దాదాపు రూ.50 లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. నిర్మాణాలు పూర్తయితే ఈ ప్రాంతంలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, షటిల్, క్రికెట్ వంటి క్రీడల్లో రాణించే అవకాశం ఉంది. విషయాన్ని అధికారులు దృష్టికి తీసుకువస్తా.

– ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో, దోమకొండ

ఆధ్యాత్మికం..

ఆలయ అభివృద్ధికి రూ.51 వేలు విరాళం



మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి నిజామాబాద్‌కు చెందిన వెంకటసాయిబాబా-దివ్యజ్యోతి దంపతులు రూ.51 వేల విరాళాన్ని శనివారం ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డికి అందజేశారు. అనంతరం దాతలను శాలువాతో సన్మానించి స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు.

సలాబత్‌పూర్ ఆలయంలో భక్తుల పూజలు



మద్నూర్(జుక్కల్): మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో శనివారం భక్తులతో, నూతన వధువరులతో సందడిగా మారింది. ఉదయం ఆలయ అర్చకులు విజయ్, అరవింద్, శైలేంద్ర మహరాజ్‌లు హనుమంతుడికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీ రామ లక్ష్మణ్ విగ్రహాలకు ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం స్వామి వారి విగ్రహాలను గ్రామంలో భజన, కీర్తనలతో పల్లకీ ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.

ఆలయ భూముల కౌలు వేలం

మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయానికి చెందిన రెండు ఎకరాల వ్యవసాయ భూమి కౌలు వేలం పాటను నిర్వహించినట్లు శనివారం ఆలయ సిబ్బంది వేణు తెలిపారు. మండలంలోని సోనాల గ్రామ శివారులోని సర్వేనెంబర్ 34బైఈలో రెండు ఎకరాలకు సోనాల గ్రామానికి చెందిన రైతు గంగాధర్ రూ.51 వేలకు అత్యధిక ధరతో కౌలును దక్కించుకున్నట్లు ఆయన చెప్పారు. ఒక సంవత్సరానికి సంబంధించి ఆలయ భూమిని రైతుకు అప్పగించామన్నారు. గతేడాది కంటే ఈసారి రూ. 13 వేలు అధికంగా వచ్చాయన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు భక్తి శ్రద్ధలతో స్వామివారిని రకరకాల పువ్వులు, వస్త్రాలతో అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం ఆలయం చుట్టు తిరుగుతూ చావ తీశారు. కార్యక్రమంలో సదాశివుడు, రాంచంద్రం, సిద్దిరాంరెడ్డి, గంగారాం, రవికుమార్ , వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఊరేగింపు

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని అయిలాపూర్ గ్రామంలో శనివారం గ్రామస్తులు దుర్గామాతకు బోనాలు తీశారు. ఇంటింటికి బోనాలు తీసుకొని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డప్పు వాయిద్యాలు, శివసత్తుల పూనకాలతో అంగరంగ వైభవంగా బోనాలు ఊరేగించారు. అమ్మవారికి బోనాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రేణుకా ఎల్లమ్మ ఆలయ ఉత్సవాలు



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని గున్కుల్ గ్రామ శివారులో శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని ప్రారంభోత్సవానికి ముస్తాబు చేశారు. గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ ఆలయం నిర్మాణం చేపట్టారు. ఆలయ ప్రారంభోత్సవం, ఎల్లమ్మ విగ్రహా ప్రతిష్ఠాపనోత్సవాలు ఈ నెల 14 వరకు నిర్వహిస్తున్నట్లు గౌడ సంఘం నాయకులు తెలిపారు.

నేడు ఎల్లారెడ్డికి మాధవానంద సరస్వతి స్వామి రాక

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలో నిర్వహించే ఆధ్మాత్మిక కార్యక్రమంలో పాల్గొనేందుకు తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి వస్తున్నట్లు భక్తబృందం శనివారం తెలిపారు. ఎల్లారెడ్డిలో ఆదివారం శత రుద్ర పారాయణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

మహిళలు స్వశక్తితో అభివృద్ధి చెందాలి





ఎల్లారెడ్డిలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీవో ప్రకాష్ , కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఏపీఎం

ఎల్లారెడ్డిరూరల్: మహిళలు స్వశక్తితో అభివృద్ధి చెందాలని ఎంపీవో ప్రకాష్ అన్నారు. శనివారం ఎల్లారెడ్డిలో గ్రామస్వరాజ్య సమత స్వచ్ఛంద సంస్థ ద్వారా మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. స్వచ్ఛంద సంస్థ వారు మహిళలకు కుట్టు శిక్షణ ఇవ్వడం సంతోషకరమని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిబాబా తదితరులున్నారు.

లింగంపల్లి(ఖుర్దు) గ్రామంలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని లింగంపల్లి(ఖుర్దు) గ్రామంలో శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్లు శనివారం ఏపీఎం శ్రీనివాస్ పంపిణీ చేశారు. గ్రామ స్వరాజ్యం సంస్థ ఆధ్వర్యంలో 30 రోజుల పాటు కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. శిక్షణ పొందుతున్న మహిళలకు ఎస్‌బిఐ బ్యాంకు సహకారంతో సర్టిఫికెట్లు, కుట్టు మిషన్లు సబ్సిడీపై అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ బండి రాజయ్య, మాజీ ఉపసర్పంచ్ రవి, కార్యదర్శి భవాని, సీసీ శ్రవణ్, జిల్లా కోఆర్డీనేటర్ వెంకటలక్ష్మి, మండల కోఆర్డీనేటర్ లావణ్య, గ్రామ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు దుర్గవ్వ, సీఏ శృతి, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి రూరల్ : గ్రామీణ ప్రాంత మహిళలకు ఉపాధి అవకాశాలు పెంపొందించే లక్ష్యంతో ఎస్బీఐ బ్యాంకు సౌజన్యంతో గ్రామ స్వరాజ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని లింగాయపల్లిలో ప్రారంభించారు. రూ. 6500 లతో కుట్టు మిషన్లను లింగాయపల్లిలో జిల్లా కోఆర్డినేటర్ వెంకటలక్ష్మి ఆదేశాలతో మండల వలంటీర్ వెంకటలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేమే అపర్ణ రవి, బీజేపీ నాయకులు కల్లూరి మల్లేశం దేవరాజు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కృష్ణాజీవాడిలో చెక్కు అందిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిరూరల్ : మండలంలోని పలు గ్రామాలలోని బాధితులకు కాంగ్రెస్ నాయకులు శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. మండలంలోని సాతెల్లి, జాన్కంపల్లిఖుర్దు, అడివిలింగాల తదితర గ్రామాలలో కాంగ్రెస్ నాయకులు బాధితుల ఇళ్లకు వెళ్లి రూ. 18లక్షల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యూత్ నాయకులు సంతోష్ తదితరులున్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆయాగ్రామాలలో 52 మంది బాధితులకు మంజూరైన రూ.16 లక్షల చెక్కులను ఇంటింటికి వెళ్లి నాయకులతో కలిసి ఆయన అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మణచారి, రాజీవ్ కుమార్, అఖిల్‌రావు, మేకల రాజు, సుధాకర్‌రావు, షౌకత్‌అలీ, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అపూర్వ సమ్మేళనం

నిజాంసాగర్(జుక్కల్) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం 2007–08 ఎస్సెస్సీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. పూర్వ విద్యార్థులు ఒకే చోట కలుసుకోవడం, అప్పటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఆటా, పాటలతో సందడిగా గడిపారు.

'ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కామారెడ్డికి లైఫ్ లైన్'



రాజంపేటలో పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజంపేట: ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కామారెడ్డికి లైఫ్ లైన్ అని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యాదవ రెడ్డి అన్నారు. ప్రాణహిత చేవెళ్లకు ప్రభుత్వం రూ.23.15 కోట్లు విడుదల చేయడంపై మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు యాదవ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు బెస్త చంద్రం, కిసాన్ సెల్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, మండల యూత్ అధ్యక్షులు కష్టారావు, సీనియర్ నాయకులు వీరన్న పటేల్, ఇమ్రాన్ అలీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ప్రాణాహిత చేవెళ్ల పైలాన్‌కు క్షీరాభిషేకం

కామారెడ్డి టౌన్: ప్రాణాహిత చేవెళ్ల ప్రాజెక్ట్ 20, 21, 22 ప్యాకేజీ పనులు పునః ప్రారంభం సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలోని పైలాన్‌కు క్షీరాభిషేకం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఐరెని సందీప్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సర్కారు బడికి పంపించాలి





జిల్లా కేంద్రంలో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు, బంజేపల్లిలో ..

మాచారెడ్డి : తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడికి పంపించాలని బంజేపల్లి యూపీఎస్ హెచ్ఎం పురుషోత్తమ శర్మ కోరారు. శనివారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ 14 మంది విద్యార్థుల పేర్లను నమోదు చేశారు. ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో బోధన చేస్తామని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్, గణేశ్, పవన్ ఉన్నారు.

జిల్లా కేంద్రంలో..

కామారెడ్డి టౌన్ : పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ గంజ్ పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. పట్టణంలో వడ్డెర కాలనీ, బతుకమ్మకుంట, రాజీవ్ నగర్ కాలనీలలో ఇంటింటా సర్వే చేసి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అభ్యర్థించారు. హెచ్ఎం నీల లింగం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన సీఆర్‌పీఎఫ్ జవాన్



ఎల్లారెడ్డి: మండలంలోని తిమ్మారెడ్డి తండాకు చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ హేమ్లానాయక్ సెలవులు రద్దు కావడంతో విధుల్లో చేరేందుకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హేమ్లానాయక్ ఈనెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు సెలవులు ఇవ్వడంతో వారం రోజుల క్రితం స్వగ్రామానికి రావడం జరిగిందన్నారు. పాకిస్థాన్‌తో యుద్ధ వాతవరణ నేపథ్యంలో ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో హేమ్లానాయక్ తిరిగి విధుల్లోకి చేరారు. హేమ్లానాయక్‌కు కుటుంబ సభ్యులు, తండావాసులు వీరతిలకం దిద్ది పంపారు.

పశువుల నీటి తొట్టెలో నీరు నింపాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని రతన్‌సింగ్ తండాలో నిరుపయోగంగా ఉన్న పశువుల నీటి తొట్టెలో నీరు నింపి ఉపయోగంలోకి తేవాలని తండావాసులు కోరుతున్నారు. ఎండలు తీవ్రంగా ఉండడంలో చెరువులు, కుంటలు పూర్తిగా ఎండిపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి పశువుల దాహార్తి తీర్చాలని కోరుతున్నారు.



రతన్ సింగ్‌తండాలో వృథాగా.. పశువుల నీటి తొట్టె

సంక్షిప్తం

దేశం తరపున పోరాడేందుకు సిద్ధంగా ఉన్నా

భిక్కనూరు: పాకిస్థాన్‌తో యుద్ధ వాతవరణం నేపథ్యంలో దేశం తరపున పోరాడేందుకు తాను సిద్ధంగా ఉన్నానని మండల కేంద్రానికి చెందిన మాజీ సైనికుడు స్వామి అన్నారు. శనివారం ఆయన భిక్కనూరులో విలేకరులతో మాట్లాడుతూ తాను 2001లో సైన్యంలో చేరి 2019లో పదవీ విరమణ పొందానన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇస్తే పాకిస్తాన్‌పై పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు.

డిగ్రీలో దోస్త్ అడ్మిషన్లు ప్రారంభం

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ ద్వారా అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ అశోక్ తెలిపారు. బిచ్కుంద కళాశాల న్యాక్‌లో ఏ గ్రేడ్, 10 ఏళ్ల అటానమస్ హోదా కలిగి ఉందన్నారు. బీఏ, బీఎస్సీ, లైఫ్‌సైన్స్, ఫిజికల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్ , అలాగే తెలుగు, ఇగ్లీష్ మీడియంలో కోర్సులు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు. వివరాలకు దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ జీ, వెంకటేష్ 9492795524 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఇంటర్‌లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

బాన్సువాడ రూరల్: మండలంలోని హన్మాజీపేట్, కోనాపూర్ గిరిజన బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో అడ్మిషన్లకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్యామలాదేవి తెలిపారు. నస్రుల్లాబాద్ మండలంలోని దుర్కి వద్ద కొనసాగుతున్న బాలికల జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో 40చొప్పున సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు ఈనెల 15న ఒరిజినల్ సర్టిఫికెట్లతో దుర్కిలోని కళాశాలలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు. పదోతరగతిలో సాధించిన మార్కుల మెరిట్, రూల్ రిజర్వేషన్ల ప్రకారం సీట్లు కేటాయిస్తామన్నారు.

కనీస పింఛన్ సాధనకు పోరాడాలి

రుద్రూర్: కార్మికులు జీవించడానికి అవసరమగు వేతనం, రిటైర్మెంట్ తర్వాత కనీస పింఛన్ సాధనకు పోరాడాల్సిన అవసరముందని టీయూసీఐ(ట్రేడ్ యూనియన్స్ సెంటర్ ఆఫ్ ఇండియా) రాష్ట్ర నాయకుడు బి.మల్లేష్ పిలుపునిచ్చారు. రుద్రూర్ మండలం రాణంపల్లిలో శనివారం భవన నిర్మాణ కార్మికులు ఎర్ర జెండాను ఎగురవేసి మేడే ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. కనీస పింఛన్ రూ.9 వేలు ఇవ్వాలని కోరారు. నాయకులు బుజ్జి స్వామి, డి. నాగేశ్వర్, న వీన్, సుమన్, అశోక్, ప్రవీణ్, సాయిబాబా, మీరా, లలిత, గోదావరి, రమాదేవి, అజ్మీర పాల్గొన్నారు.

ఆస్పత్రి శ్లాబ్‌పై ప్లస్ సింబల్ పెయింటింగ్



భిక్కనూరు: మండలకేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి శ్లాబ్‌పై ఎరుపురంగుతో ప్లస్ పెయింటింగ్‌ను శనివారం వేయించినట్లు ప్రభుత్వ వైద్యురాలు యెమిమా, ఎంపీహెచ్ఈవో వెంకరమణ తెలిపారు. పాకిస్థాన్‌తో యుద్ధ వాతవరణం నేపథ్యంలో దవాఖానాను యుద్ధ విమానాలు, హెలికాప్టర్ల నుంచి గుర్తించేందుకు వీలుగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ సింబల్ వేయించినట్టు వారు పేర్కొన్నారు.